క్లుప్తంగా

పనులు త్వరగా పూర్తి చేయాలి


పనులు పరిశీలిస్తున్న ఎంపీడీవో

వీర్నపల్లి: మండలంలో సీతారాం నాయక్ తండా, వన్‌పల్లి పాఠశాలల్లో జరుగుతున్న మన ఊరు–మన బడి పనులను మండల ఇంచార్జీ ఎంపీడీవోగా నరేశ్‌కుమార్ మంగళవారం పరిశీలించారు. ఈ పనులను త్వరగా పూర్తిచేయాలని ఏఈ పీఆర్ వెంకన్నను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు, పంచాయితీ కార్యదర్శులు పాల్గొన్నారు.

సమాధుల తోట ఏర్పాటు చేయాలి


తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న క్రైస్తవులు

ఎల్లారెడ్డిపేట: మండల కేంద్రంలో క్రైస్తవులు అంత్యక్రియలు నిర్వహించేందుకు సమాధుల తోట ఏర్పాటు చేయాలని చర్చి పాస్టర్లు ప్రేమ్ కుమార్, మధుబాబు మంగళవారం తహసీల్దార్ జయంత్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. సమాధుల తోట ఏర్పాటు కోసం ప్రభుత్వ భూమిని గుర్తించేందుకు సహకరిస్తానని హామీ ఇచ్చారు. అబ్రహం, రాజేశ్, జోసెఫ్, జాన్, లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.

ప్రమాద బీమా చెక్కులు అందజేత


చెక్కులు అందజేస్తున్న కొండూరి రవీందర్‌రావు

వీర్నపల్లి: గత సంవత్సరం విద్యుత్ షాక్‌తో మృతిచెందిన మండలంలోని ఎర్రగడ్డ తండాకు చెందిన బానోతు రవినాయక్, బానోత్ లీల కుటుంబాలకు టెస్కాబ్ చైర్మెన్ కొండూరి రవీందర్‌రావు, టీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య మంగళవారం రూ.2 లక్షల ప్రమాద బీమా చెక్కులను అందజేశారు. టీఆర్ఎస్ సభ్యత్వం తీసుకున్న వీరిద్దరికి ప్రమాద బీమా మంజూరైనట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ మాలోతు బూల, జెడ్పీటిసి గుగులోతు కళావతి, సెస్ డైరెక్టర్ మాడుగుల మల్లేశం, రాజిరెడ్డి పాల్గొన్నారు.

ఫైలేరియా కిట్ల పంపిణీ


వరదవెల్లిలో కిట్లు పంపిణీ చేస్తున్న సిబ్బంది

బోయినపల్లి: మండలంలోని వరదవెల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో మంగళవారం కొదురుపాక పీహెచ్‌సీ వైద్యసిబ్బంది ఆధ్వర్యంలో ఫైలేరియా బాధితులకు కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ ఆరెపల్లి లత, రాజు, ఆశా కార్యకర్తలు ఉన్నారు.

అడుగడుగునా నిఘా నేత్రాలు

- దాతల సహకారంతో ఊరూరా సీసీ కెమెరాలు
- నేర నియంత్రణలో దాతల భాగస్వామ్యం
- నేరగాళ్లను పట్టిస్తున్న సీసీ కెమెరాలు

ముస్తాబాద్: నేరాల నియంత్రణలో ప్రజల భాగస్వామ్యంతో పోలీసులు ఆధునిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్నారు. నగరాలు, పట్టణాలకే పరిమితమైన సీసీ కెమెరాలను పల్లెల్లో ఏర్పాటు చేసి నేర నియంత్రణ చర్యలు ప్రజలకు భరోసా కల్పిస్తున్నాయి. ఎస్సై వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఊరురా సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నారు. ముస్తాబాద్‌తోపాటు మండలంలో 15 గ్రామాలు ప్రస్తుతం సీసీ కెమెరాల పర్యవేక్షణలో ఉన్నాయి.

ఆధునిక పరిజ్ఞానంతో..

ముస్తాబాద్‌లో ఏనిమిదేళ్ల క్రితం ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు ధ్వంసమయ్యాయి. మండలంలో చాలా గ్రామాల్లో సీసీ కెమెరాలు ఉన్నా, మండల కేంద్రంలో మాత్రం లేకపోవడంతో వాటి ఏర్పాటుకు స్థానిక ఎస్సై వెంకటేశ్వర్లు ప్రత్యేక చొరవ తీసుకున్నారు. రోజు రోజుకు విస్తరిస్తున్న పట్టణ విస్తీర్ణం, జనాభాకు అనుగుణంగా పెరుగుతున్న నేరాలను కట్టడి చేసేందుకు ఆధునిక సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. పట్టణంలోని వ్యాపారుల సహకారంతో రూ.4 లక్షల వ్యయంతో తెలంగాణ చౌక్, రాజీవ్ చౌక్, కొత్త బస్టాండ్, దుబ్బాక రోడ్డు తదితర ప్రాంతాల్లో హెచ్‌డీ క్వాలిటీతో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. ఆన్‌లైన్ అనుసంధానంతో కంట్రోల్ రూమ్ నుంచి ఎస్సైతో పాటు ఇద్దరు కానిస్టేబుళ్లు నిత్యం పర్యవేక్షించేందుకు వీలుగా మొబైల్ కనెక్షన్ ఇచ్చారు. దీంతో ఎప్పటికప్పుడు ముస్తాబాద్‌తోపాటు గూడెం, మోహినికుంట, చిప్పలపల్లి, బందనకల్, మద్దికుంట గ్రామాలపై అనుక్షణం నిఘా పెట్టనున్నారు.


కంట్రోల్ రూమ్‌లో కెమెరాలను పరిశీలిస్తున్న ఎస్సై వెంకటేశ్వర్లు, ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు

దాతల సహాయంతో..

మండలంలో బందనకల్‌లో గాంధీరావు, చిప్పలపల్లి, రాంరెడ్డిపల్లెలో హన్మంత్‌రావు, మోహినికుంటలో గోపాల్‌రావు, మద్దికుంట, మొర్రాయిపల్లెలో శరత్‌రావు, గూడెంలో గ్రామస్తులు, చీకొడు, నామాపూర్, కొండాపూర్‌లలో స్థానికుల సహకారంతో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. దొంగతనాలు, అపహరణలు, పరస్పర దాడులు, రోడ్డు ప్రమాదాలు, అసాంఘిక కార్యకలాపాలు వంటి ఘటనలపై పోలీసులకు సీసీ ఫుటేజీ ఆధారంగా లభించనుంది. సీసీ కెమెరాలతో నేరాలు అదుపులో ఉంటాయి. తరచూ ఆందోళనలు జరిగే ముస్తాబాద్ పట్టణంలో ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షించవచ్చు. గతంలో మోహినికుంట, ముస్తాబాద్, చిప్పలపల్లి, గూడెంలలో జరిగిన ఘటనలలో దొంగలను సీసీ కెమెరాల ఆధారంగా పట్టుకున్నారు. అలాగే రోడ్డు ప్రమాదాలకు కారణమైన వాహనాలను పట్టుకుని బాధిత కుటుంబాలకు న్యాయం చేశారు.

నేరాలు అదుపులో ఉంటాయి



మండలంలో దాతలు, ప్రజాప్రతినిధుల సహకారంతో 15 గ్రామాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశాం. నేరాలు జరగకుండా ఉండేందుకు ఈ కెమెరాలు తోడ్పడుతాయి. గతంలో అనేక గ్రామాల్లో సీసీ కెమెరాల ఆధారంగా నిందితులను పట్టుకున్నాం. సీసీ కెమెరాలు నేరగాళ్ల పాలిట సింహస్వప్నంగా పనిచేస్తున్నాయి.

– వి.వెంకటేశ్వర్లు, ఎస్సై ముస్తాబాద్

నాలుగేళ్ల క్రితమే ఏర్పాటు



మోహినికుంటలో నాలుగేళ్ల క్రితమే సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి ఎస్పీ చేతుల మీదుగా ప్రారంభించాం. పలు కేసుల్లో నిందితులు కెమెరాల ఆధారంగా పోలీసులు గుర్తించారు. మంత్రి కేటీఆర్ స్ఫూర్తితో సీసీ కెమెరాలను అన్ని గ్రామాల్లో ఏర్పాటు అయ్యేలా చూస్తున్నాం.

– కల్వకుంట్ల గోపాల్‌రావు, ఆర్‌బీఎస్ అధ్యక్షుడు

రెండు గ్రామాల్లో నిఘా



మద్దికుంట, మొర్రాయిపల్లె గ్రామాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశాను. కంట్రోల్ రూమ్‌లు సైతం పెట్టి పోలీసులకు ఎప్పటికప్పుడు సమాచారం వెళ్లేలా ఏర్పాటు చేశాం. ఆధునిక పరిజ్ఞానంతో అంతటా సీసీ కెమెరాలు పెట్టిస్తున్నాం. వీటితో నేరాల నియంత్రణ వల్ల ప్రజలు ప్రశాంతంగా ఉంటారు.

– జనగామ శరత్‌రావు, ఎంపీపీ

స్వాతంత్య్ర పోరాట చరిత్ర తెలుసుకోవాలి


కరపత్రాలు పంపిణీ చేస్తున్న కమిటీ సభ్యులు

ముస్తాబాద్: నిజాం విముక్త స్వాతంత్య్ర పోరాట చరిత్రను భావి తరాలకు అందించాలని నిజాం విముక్త స్వతంత్య్ర అమృతోత్సవాల సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి తోట ధర్మేందర్ అన్నారు. ముస్తాబాద్‌లో హైదరాబాద్ స్టేట్ 75వ స్వతంత్య్ర సందర్భంగా మంగళవారం రాత్రి చరిత్ర కరపత్రాలు, పుస్తకాలను పంపిణీ చేశారు. ధర్మేందర్ మాట్లాడుతూ నైజాం విముక్తి కోసం వేలాది మంది ప్రాణ త్యాగం చేశారన్నారు. రజాకార్ల నిరంకుశత్వానికి ఎదురొడ్డి పోరాటం చేసిన వారిని మరువరాదన్నారు. నైజాం విముక్త పోరాట చరిత్రను భవిష్యత్ తరానికి అందించేందుకు అమృతోత్సవ వేళ ఇంటింటికి కరపత్రాలు తీసుకెళ్తున్నామన్నారు. కొండ భాను, సంతోష్‌రెడ్డి, శ్రీకాంత్ పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణాన్ని చేపట్టాలి

ఎల్లారెడ్డిపేట: మండల కేంద్రంలోని సుప్రసిద్ధ శ్రీవేణుగోపాలస్వామి ఆలయ నిర్మాణానికి ప్రభుత్వం నిధులు కేటాయించి నిర్మాణ పనులు పూర్తి చేయాలని బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి సందుపట్ల లక్ష్మారెడ్డి డిమాండ్ చేశారు. వందేళ్ల చరిత్రగల ఈ ఆలయంలో ప్రతి కార్తీక మాసంలో వారం రో జులపాటు విశిష్ట ఉత్సవాలు జాతర, రథోత్సవాలు నిర్వహిస్తారన్నారు. ఆలయ నిర్మాణానికి ప్రభుత్వం మంజూరు చేసిన రూ.50 లక్షలు విడుదల చేసి నిర్మాణ పనులు పూర్తి చేయాలన్నారు. శ్రీకాంత్‌రెడ్డి, రవి, వేణు, రాజుయాదవ్, కృష్ణరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

విద్యారంగానికి పెద్దపీట

- జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ

సిరిసిల్లటౌన్/కోనరావుపేట: ఏ రాష్ట్రంలో లేని విధంగా తెలంగాణాలో విద్య, వైద్య రంగాలకు సీఎం కేసీఆర్ పెద్దపీట వేస్తున్నారని జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ అన్నారు. మంగళవారం సిరిసిల్ల మున్సిపల్ స్థాయి టీఎల్ఎం మేళాను స్థానిక గీతానగర్ పాఠశాలలో, కోనరావుపేటలో ఆమె ప్రారంభించి మాట్లాడారు. పిల్లలు చదువును సులువుగా అభ్యసించేందుకు ఇలాంటి మేళాలు దోహదం చేస్తాయన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య, మౌలిక వసతులు కల్పనకై సర్కారు రూ.10 వేల కోట్లు ఖర్చు చేస్తుందన్నారు. పాఠశాలల ఆధ్వర్యంలో సబ్జెక్ట్‌ల వారీగా తయారు చేసిన పరికరాలను ఆమె పరిశీలించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ, డీఈవో రాధాకిషన్, ఎంఈవో రఘుపతి పాల్గొన్నారు.

హన్మాజీపేటలో..

వేములవాడరూరల్: మండలంలోని హన్మాజిపేట ప్రభుత్వ పాఠశాలలో మేళాను డీఈవో రాధాకిషన్ సందర్శించి వారిని అభినందించారు. ఉపాధ్యాయులకు పాఠాలే కాకుండా మేళాను నిర్వహించి వారికి అర్థమయ్యే విధంగా కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమన్నారు.


సిరిసిల్లలో టీఎల్ఎం మేళాలో జెడ్పీ వైస్ చైర్మన్

అలరించిన మేళా

ముస్తాబాద్: విద్యార్థులలో అభ్యాసన సామర్థ్యం పెంపుదలకు చేపట్టిన బోధనాభ్యాసన సామాగ్రి మేళా ఆకట్టుకుంది. స్థానిక జెడ్పీ బాలుర పాఠశాలలో రెండు రోజులపాటు జరిగే మేళాను ఎంపీపీ జనగామ శరత్‌రావు మంగళవారం ప్రారంభించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు తయారు చేసిన బోధనాభ్యాసన పరికరాలు వారిని ఆలోచింప చేశాయి. జెడ్పీటీసీ గుండం నర్సయ్య, ఆర్‌బీఎస్ అధ్యక్షుడు గోపాల్‌రావు, సెస్ డైరెక్టర్ అంజిరెడ్డి, ఎంపీడీవో రమాదేవి, హెచ్ఎంలు విఠల్‌నాయక్, రవీందర్, రాధాకిషన్‌రావు, రాజు, ప్రభాకర్ పాల్గొన్నారు.


ముస్తాబాద్‌లో టీఎల్ఎమ్ మేళా

ఎల్లారెడ్డిపేట: ఎల్లారెడ్డిపేటలో టీఎల్ఎమ్ ప్రదర్శన మేళాను బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య ప్రారంభించారు. ఎంపీపీ రేణుక, జెడ్పీటీసీ లక్ష్మణ్‌రావు, సెస్ డైరెక్టర్ కృష్ణహరి పాల్గొన్నారు.

వీర్నపల్లి: వీర్నపల్లి మండల కేంద్రంలోని రైతు వేదిక ఆవరణలో టీఎల్ఎం మేళాను టెస్కాబ్ చైర్మెన్ కొండూరి రవీందర్ రావు, టీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య మంగళవారం సందర్శించారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెడ్‌మాస్టర్ రవి, ఎంపీపీ భూల, జెడ్పీటీసీ కళావతి, సర్పంచ్ దినాకర్, ఎంపీటీసీ అరుణ్ కుమార్, సెస్ డైరెక్టర్ మల్లేశం, ఎంఈఓ రఘుపతి పాల్గొన్నారు.

కప్పకున్న మంచు దుప్పటి


బోయినపల్లి/కోనరావుపేట: తెల్లవారురుజామున తెలిమంచు కురుస్తోంది. దీంతో రోడ్లపై వాహనదారులు లైట్లు వేసుకుని వాహనాలు నడపాల్సి వస్తోంది. బోయినపల్లి నుంచి వేములవాడ వెళ్లే దారిలో, కోనరావుపేటలో ఉదయం ఏడు గంటలు దాటినా మంచు దుప్పటి కప్పివేస్తోంది.

సావిత్రిబాయి పూలేకు నివాళి


వేములవాడరూరల్: హన్మాజిపేటలో జయంతి ఉత్సవాల్లో పాల్గొన్న డీఈవో రాధాకిషన్


సిరిసిల్ల గ్రంథాలయంలో సావిత్రిబాయి చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న చైర్మన్ శంకరయ్య

కోనరావుపేట: తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రీబాయి పూలే జయంతిని జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. కోనరావుపేటలో జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ ఆమె చిత్రపటానికి పూల మాల వేసి నివాళి అర్పించారు.

సిరిసిల్లకల్చరల్: జిల్లా కేంద్ర గ్రంథాలయ భవనంలో నిర్వహించిన కార్యక్రమంలో చైర్మన్ ఆకునూరి శంకరయ్య, బీసీ స్టడీ సర్కిల్‌లో డైరెక్టర్ జెల్ల వెంకటస్వామి సావిత్రీబాయి చేసిన సేవలను స్మరించుకున్నారు.

వేములవాడరూరల్: మండలంలోని హన్మాజిపేట ప్రభుత్వ పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి రాధాకిషన్ హాజరై నివాళి అర్పించారు.

తంగళ్లపల్లి: స్థానిక సీపీఎం కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి కోడం రమణ, సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

గంభీరావుపేట: మండలంలోని దమ్మన్నపేట పాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవం నిర్వహించారు.

ముస్తాబాద్: స్థానిక కస్తూర్బా విద్యాలయంలో నిర్వహించిన వేడుకల్లో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు కుర్ర రాకేశ్, ఎంపీడీవో రమాదేవి, ప్రత్యేకాధికారి శ్రీలత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రుద్రంగి: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సావిత్రిబాయి పూలే జయంతిని ఘనంగా నిర్వహించారు.

చందుర్తి: మండల కేంద్రంలో, మూడపల్లి, బండపల్లి గ్రామాల్లో నిర్వహించిన కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చింతపంటి రామస్వామి, జెడ్పీటీసీ కుమార్, జిల్లా కార్యదర్శి గొట్టె ప్రభాకర్, ఎంపీటీసీలు పులి రేణుక, మ్యాకల గణేశ్ పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట: స్థానిక మండల వనరుల కేంద్రంలో నిర్వహించిన సావిత్రిబాయి పూలే జయంతి వేడుకల్లో ఎంపీపీ రేణుక, జెడ్పీటీసీ లక్ష్మణ్‌రావు, సెస్ డైరెక్టర్ కృష్ణహరి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీనియర్ అసిస్టెంట్‌గా పదోన్నతి

వేములవాడ: వేములవాడ రాజన్న ఆలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న సురేశ్ అనే ఉద్యోగికి ఆలయ ఈవో కృష్ణప్రసాద్ సీనియర్ అసిస్టెంట్‌గా ప్రమోషన్ కల్పిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. ఆమేరకు ఆలయ ఏఈవో హరికిషన్ మంగళవారం పదోన్నతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఏఈవో ప్రతాప నవీన్, పర్యవేక్షకులు సిరిగిరి శ్రీరాములు, హరినాథ్, అరుణ్, వెల్ది సంతోష్, గోలి శ్రీనివాస్, ఎడ్ల శివ పాల్గొన్నారు.

సంఘాలు - ఎన్నికలు

శ్రీకృష్ణ యాదవ సంఘం కార్యవర్గం

సిరిసిల్లఅర్బన్: సిరిసిల్ల మున్సిపల్ పరిధి చంద్రంపేటలో శ్రీ కృష్ణ యాదవ సంఘం నూతన కమిటీని మంగళవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా అన్నవేణి పర్శరాములు యాదవ్, ఉపాధ్యక్షుడు కావటి ప్రేమ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి బీనవేణి మల్లేశం, కోశాధికారి, పర్శరాములు, బీనవేణి శ్రీకాంత్‌ను ఎనుకున్నారు.

సబ్‌స్టేషన్‌కు మోక్షమెప్పుడో.?



ధర్మారంలో పూర్తయిన సబ్‌స్టేషన్ పనులు

- పనులు పూర్తయి ఏడాది
- ప్రారంభించేందుకు మీనమేషాలు

కోనరావుపేట: మండలంలోని ధర్మారంలో విద్యుత్ సబ్‌స్టేషన్ పనులు పూర్తయి 8 నెలలు గడుస్తున్నా, ఇప్పటికీ ప్రారంభానికి నోచుకోలేదు. సబ్‌స్టేషన్ ప్రారంభం కాకపోవడంతో మూడు గ్రామాల్లో లోవోల్టేజీ సమస్యతో వినియోగదారులు ఇబ్బందిపడుతున్నారు.

పూర్తయిన సబ్‌స్టేషన్ పనులు

ఎన్పీడీసీఎల్ నుంచి రూ.1.25 కోట్లతో నిర్మించిన 33/11 కేవీ సబ్‌స్టేషన్ పనులను 2020 ఫిబ్రవరి 6న ఎమ్మెల్యే రమేశ్‌బాబు ప్రారంభించారు. ఎమ్మెల్యే ఆదేశాలతో పనులు త్వరితగతిన పూర్తయ్యాయి. ఆపరేటర్ల గది, మిషనరీ, రక్షణ వ్యవస్థ తదితర పనులు పూర్తయ్యాయి. ఈ సబ్‌స్టేషన్ వల్ల మల్కపేట, ధర్మారం, కనగర్తి గ్రామాలకు లోఓల్టేజీ సమస్య తీరనుంది. ధర్మారం గ్రామంలో 800 గృహ కనెక్షన్లు, 750 వ్యవసాయ కనెక్షన్లు ఉన్నాయి. మలక్పేటలో 750 వ్యవసాయ కనెక్షన్లు ఉన్నాయి. కనగర్తి శివారులోని మూడు రైస్‌మిల్లులకు నిరంతర విద్యుత్ కనెక్షన్లు ఇవ్వనున్నారు.

నర్సరీల పరిశీలన

ఇల్లంతకుంట: మండలంలోని ముస్కాన్‌పేట, పత్తికుంటపల్లి, కేశన్నపల్లి గ్రామాల్లో హరిత నర్సరీలను ఏపీవో చంద్రయ్య మంగళవారం పరిశీలించారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

తంగళ్లపల్లి: మండలంలోని మండెపల్లి గ్రామంలో పలు లబ్ధిదారులకు సర్పంచ్ గనప శివజ్యోతి మంగళవారం సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. ఆసాని పర్శయ్యకు రూ.లక్షా 10 వేలు, కావేరికి రూ.45 వేలు, విజయ్‌కి రూ.35 వేలు, మరొకరికి 12 వేలు చొప్పున చెక్కులు అందజేశారు.

ఎల్లారెడ్డిపేట: మండలంలోని రాచర్లబొప్పాపూర్‌లో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య మంగళవారం సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

ఎల్లారెడ్డిపేట: ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో ప్రాథమిక ఉపాధ్యాయ సంఘం నూతన సంవత్సర క్యాలెండర్‌ను బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య మంగళవారం ఆవిష్కరించారు.

సిరిసిల్లఅర్బన్: సిరిసిల్ల పట్టణంలోని జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో పీఆర్‌టీయూ టీఎస్ 2023 క్యాలెండర్‌ని మంగళవారం జెడ్పీ సీఈవో గౌతంరెడ్డి ఆవిష్కరించారు.

కోనరావుపేట: మండల కేంద్రంలో పీఆర్టీయూ టీఎస్ నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఎంపీపీ ఎదురుగట్ల చంద్రయ్య, ఎంఈవో జక్కని నరేందర్, సర్పంచ్ పోకల రేఖ మంగళవారం ఆవిష్కరించారు.

ముస్తాబాద్: మండల వనరుల కేంద్రంలో టీపీటీఎఫ్ క్యాలెండర్‌ను జిల్లా ఉపాధ్యక్షుడు హన్మంత్‌రెడ్డి ఆవిష్కరించారు.

ఎక్సైజ్ అధికారుల దాడులు

గంభీరావుపేట: మండలంలోని ముచ్చర్ల, లింగన్నపేట గ్రామాల్లో మంగళవారం ఎల్లారెడ్డిపేట ఎక్సైజ్ సీఐ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో అధికారులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 8 లీటర్ల గుడుంబాను స్వాధీనపర్చుకొని బాధ్యులైన నలుగురిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. గుడుంబా తయారీ, సేవించే అనుమానాస్పద వ్యక్తులైన మరో ఐదుగురిని తహసీల్దార్ మధుసుదన్‌రెడ్డి ఎదుట బైండోవర్ చేసినట్లు తెలిపారు.

దివ్యాంగులకు ఫిజియోథెరపీ



వేములవాడరూరల్: వేములవాడ భవిత సెంటర్‌లో చదువుకుంటున్న పలువురు దివ్యాంగులకు డా.మయూరి ఫిజియోథెరపి చేశారు. వివిధ రకాల అంగవైకల్యాలతో బాధపడుతున్న ఎందరో చిన్నారులకు భవిత సెంటర్‌కు వచ్చి ఆమె తన సేవలను అందిస్తున్నారు. వారి కుటుంబసభ్యులు ఆ చిన్నారులను కేంద్రానికి తీసుకురావడంలో నిర్వాహకురాలు జయలక్ష్మి వైద్య సేవలు అందిస్తున్నారు.

సోషల్ టాలెంట్ టెస్ట్

తంగళ్లపల్లి/ఎల్లారెడ్డిపేట/కోనరావుపేట/ఇల్లంతకుంట/గంభీరావుపేట/బోయినపల్లి: జిల్లా వ్యాప్తంగా అన్ని మండల కేంద్రాల్లోని ప్రభుత్వ పాఠశాల పదో తరగతి విద్యార్థులకు మంగళవారం మండల స్థాయి సోషల్ టాలెంట్ టెస్టు నిర్వహించారు. వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేశారు.

వైద్యాధికారిగా వేణుమాధవ్

కోనరావుపేట: స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారిగా పెద్దూరుకు చెందిన కోన వేణుమాధవ్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇదివరకు వైద్యాధికారిగా పనిచేసిన మోహనకృష్ణ పీజీ చదువుల కోసం వెళ్లగా ఆయన స్థానంలో నియమించారు.

మైనార్టీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తు చేసుకోవాలి

కోనరావుపేట: మైనార్టీ కార్పొరేషన్ రుణాలకు ఈ నెల 5 లోగా దరఖాస్తు చేసుకోవాలని ఎంపీపీ ఎదురుగట్ల చంద్రయ్య, ఎంపీడీవో రామకృష్ణ తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం మాట్లాడుతూ మైనార్టీ కార్పొరేషన్‌లో ముస్లింలకు స్వయం ఉపాధికి రుణాలు అందిస్తారని తెలిపారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
సిరిసిల్ల జిల్లా:
9951602934, 9010610963
Office mail : knrjagati@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
రమేష్, ACO - 7997958214
సిరిసిల్ల : రఘు - 7331119957
వేములవాడ : నవీన్ - 7997958211
టోల్ ఫ్రీ నెం. : 1800 425 9899